సర్వే వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి తదితరులు



సర్వేను పరిశీలిస్తున్న జెడ్సీ

డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి

శేరిలింగంపల్లి: సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు చేసిన సర్వేను ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు తనిఖీ చేయాలని శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి సూచించారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో సర్వేలో పాల్గొనే సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచే సర్వే ప్రారంభించాలన్నారు. ఎన్యూమరేటర్లు చేసే సర్వేలో కొన్నింటిని చెక్ చేయాలని, సర్వే పూర్తి చేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు అందజేసేలా చూడాలన్నారు. ప్రతి ఇంటికి స్టిక్కర్ వేయడంతో పాటు ఆయా ఇళ్లను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. సర్వేలో తీసుకున్న వివరాలను గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీలు శ్రవణ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన జెడ్సీ

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని మై హోం భూజాలో సర్వే తీరును జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డిలు పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు.

5,559 ఇళ్ల వివరాలు నమోదు..

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో మంగళవారం 5,559 కుటుంబాల వివరాలను నమోదు చేసినట్లు సర్కిల్ అధికారులు తెలిపారు. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డిలు పర్యటించారని తెలిపారు.

కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో ప్రసవాలు

డెలివరీ కోసం వస్తున్న కార్పొరేట్ ఉద్యోగులు ● అక్టోబర్‌లో 278 డెలివరీలు.. 24 గంటలు వైద్యసేవలు

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఒకే నెలలో రికార్డు స్థాయిలో 278 డెలివరీలు చేయడంతో ఉన్నతాధికారులు డాక్టర్లను అభినందిస్తున్నారు. ఐటీ కారిడార్‌లో ఉన్న కొండాపూర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి నిత్యం రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ఓపీకి సుమారు 600 మందికి పైగానే వస్తుంటారు. వివిధ వార్డులలో ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. ముఖ్యంగా గైనకాలజీ ఓపీ వార్డుకు నిత్యం వందల సంఖ్యలో మహిళలు ,గర్భిణులు వస్తుంటారు. డెలివరీ వార్డు ఎపుడూ రద్దీగానే కనపడుతోంది.



కొండాపూర్ జిల్లా ఆస్పత్రి

జనవరి–అక్టోబర్ వరకు 2,215 ప్రసవాలు

ఈ సంవత్సరం జనవరి నుంచి అక్టోబర్ వరకు దాదాపు 2,215 మంది గర్భిణులకు డాక్టర్లు డెలివరీ చేశారు. అక్టోబర్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో 278 మందికి ప్రసవాలు చేశారు. దాదాపు 147 సాధారణ ప్రసవాలు జరిగాయి. కార్పొరేట్ ఉద్యోగినులు సైతం కొండాపూర్ హాస్పిటల్‌లో డెలివరీ చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇన్ఫోసిస్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కొద్ది రోజుల క్రితం ఇక్కడి డాక్టర్లు డెలివరీ చేశారు. కాగా డెలివరీ కేసుల సంఖ్య పెరగడానికి కార్పొరేట్ ఉద్యోగులు రావడమే కారణమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి తెలిపారు. 2023లో ఒక్క నెలలో 275 డెలివరీ కేసులు నమోదయ్యాయి. కాగా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగినిరెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రోగులకు ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా వారు తెలిపారు.



డెలివరీ వార్డులో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనురాగినిరెడ్డి

డాక్టర్ల సేవలు భేష్

నర్సింగ్ సేవలు, డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉండటంతో డెలివరీ కోసం వచ్చే వారి సంఖ్య పెరుగుతుందని కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగినిరెడ్డి తెలిపారు. పేదలు మాత్రమే కాకుండా కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేయించుకునేందుకు ఆసక్తి కనబరచడం హర్షించదగ్గ పరిణామమని ఆమె పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 30, పచ్చిమిర్చి 45, బెండ 60, కాకర 60, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 50, గోకర 60, బీన్స్ 80, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 80, చిక్కుడు 80, ఉల్లి 70(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 350.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌కి చెందిన మోహన్‌నాయక్ వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేలు చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు బాలింగ్ గౌతమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఆయన పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్లో పలుచోట్ల డ్రైనేజీ లైన్లు సరిగా లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని జీహెచ్ఎంసీ డీజీఎం శివకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన డీజీఎం రేపటి నుండి మరమ్మతు పనులు ప్రారంభిస్తామని చెప్పారని కార్పొరేటర్ తెలిపారు.

హెచ్‌సీయూ–ఎంఐఐహెచ్ ఎంఓయూ



ఒప్పంద కార్యక్రమంలో హెచ్‌సీయూ వీసీ బీజేరావు, ఎంఐఐహెచ్ ఈడీ సుప్రియాగోలి, అధికారులు

రాయదుర్గం: మైక్రో ఇన్సూరెన్స్ రంగంలో పురోగతి లక్ష్యంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ–మైక్రో ఇన్సూరెన్స్ ఇన్నోవేషన్ హబ్ (ఎంఐఐహెచ్)ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళవారం ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం అభివృద్ధి, సామర్థ్యంను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలపై దృష్టి సారిస్తుంది. హెచ్‌సీయూ కోఆర్డినేటర్‌గా స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ దేబాషిస్ ఆచార్య వ్యవహరిస్తారు. అలాగే ఎంఐఐహెచ్‌కి సమన్వయకర్తగా ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుప్రియాగోలి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ మేరకు ఎంఐఐహెచ్ ఫౌండర్ అసోసియేట్ మైక్రో ఎస్యూర్ సీఈఓ కమలాకర్‌సాయి పలవాసల, హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్ చాన్సలర్ బీజేరావు మాట్లాడుతూ ఈ ఒప్పందంతో నైపుణ్యం పెంపు, వాటాదారులకు శిక్షణ ఇవ్వడానికి, జ్ఞాన భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ ప్రొఫెసర్ ఆర్ విజయ్, ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ సబాత్,హెచ్‌సీయూ పీఆర్‌ఓ ఆశిష్ జోకబ్ థామస్, మైత్ర దాసరి, అలేఖ్య వాకలపూడి, అదితి, ఆయేషా, సున్నం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య.. పరిశీలించిన కార్పొరేటర్



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని డ్రైనేజీ లీకేజీ సమస్యతో చుట్టుపక్కల కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. భగత్‌సింగ్‌నగర్ ఫేజ్ 1, 6వ ఫేజ్ కాలనీవాసుల ఇబ్బందులను పరిష్కరించాలని జేఎన్‌టీయూ అధికారులు, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గచ్చిబౌలి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సాయినాథ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు పట్టణం జీవీ కాలనీకి చెందిన మల్లి గోపి(45) పర్వత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వట్టినాగులపల్లిలో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తుండటంతో డ్యూటీ నుంచి తీసేశారు. దీంతో తాగి వచ్చి భార్య, పిల్లలతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలోనే ఐదు రోజుల క్రితం ఇంట్లో గొడవ జరగడంతో బయటకు వచ్చి వట్టినాగులపల్లిలోని ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్ కాలనీ, మాధవహిల్స్, గోల్డెన్ తులీప్ రోడ్ నెంబర్ 1,2,3,4,5, వెంకటరమణ మోటార్స్ లేన్, హైటెన్షన్ లైన్, విజేత సూపర్‌మార్కెట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

చందానగర్‌లో..

చందానగర్: చందానగర్ : హఫీజ్‌పేట్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

◆ విశ్వంభర ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విశ్వంభర కొంత భాగం, శిల్పా ఎవెన్యూ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ కల్యాణ్ గార్డెన్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు మాతృశ్రీనగర్ కొంతభాగం, బొమ్మరిల్లు, సాయిరంగ థియేటర్, రాజారాం కాలనీ, మాధవనగర్, అంబేద్కర్ నగర్, నందినగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

◆ దుర్గామాత ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి 10.30 గంటల వరకు ఆల్విన్ కాలనీ క్రాస్ రోడ్డు, సితార గ్రాండ్, 2గెదర్‌మెంట్స్ అపార్ట్‌మెంట్స్, జనప్రియనగర్ ఫేజ్ 1,2,3,4,5,6, జనప్రియ నగర్, కుమ్మరి బస్తీ, సాయిరాంనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: న్యూ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి 3.30 గంటల వరకు న్యూ కాలనీ, లక్ష్మీనగర్, మియాపూర్ ఎక్స్ మెయిన్ రోడ్డు, ఓంకార్ నగర్ థ్యాంక్స్ అండ్ రీగార్డ్స్, హైదర్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆదర్శనగర్, శాంతినగర్, ఉషోదయా అపార్ట్‌మెంట్స్ రోడ్డు, ధర్మపురి టెంపుల్ రోడ్డు, దీప్తిశ్రీనగర్ రోడ్డు నంబర్ 14,15,24,25, జీహెచ్ఎంసీ పార్కు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంగళవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ, పైపులైన్ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కార్పొరేటర్ కలిసి డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని శాంతినగర్, బండ్లగూడ, బాలాజీనగర్, ఆల్విన్ కాలనీలలో రోడ్లు వర్షానికి దెబ్బతిన్నాయని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పటాన్‌చెరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్సీఓ మెదక్ గౌతమ్‌రెడ్డి అన్నారు.మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి అండర్ –19 క్రీడాపోటీలను గౌతమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటలతో శారీరక వ్యాయామం కలుగుతుందని మానసికంగా ఉల్లాసంగా ఉంటుందన్నారు. ఈ పోటీలకు జిల్లాస్థాయిలో 16 పాఠశాలలకు సంబంధించిన 525 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పరిసరాల శుభ్రత పాటించాలి

రాజేంద్రనగర్: బస్తీల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త చెదారాన్ని తొలగించడంతో బాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. మంగళవారం సర్కిల్ పరిధిలోని డెయిరీ ఫామ్ జంక్షన్ వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పాన్‌షాపు నిర్వాహకుడు డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాన్‌షాపు వద్ద డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలి



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ మాధురి తనిఖీ చేశారు. మంగళవారం మండలంలోని నల్లవల్లి, గుమ్మడిదల గ్రామాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల నుంచి ప్రతి గింజ కొంటామన్నారు. కొనుగోలు చేసిన వారంలోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి, కానుకుంట కేంద్రాల తనిఖీ

మండలంలోని కొత్తపల్లి ,కానుకుంట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జయశ్రీ రాజ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు రికార్డులను పరిశీలించారు. కాలయాపన లేకుండా త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. ఏఈఓ టోకెన్ జారీ చేసిన తర్వాత తూకం వేయాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శివకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాక్స్‌టైప్ డ్రైన్ పనుల్లో వేగం పెంచాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బాక్స్‌టైప్ డ్రైన్ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గాను బాక్స్ టైప్ డ్రైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు లక్ష్మణ్ యాదవ్, గోపాల్‌యాదవ్, సురేష్ రాథోడ్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకాష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గౌతమ్‌గౌడ్, అధ్యక్షులు పవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కోఆర్డినేటర్ బెనర్జీ, పరమేశ్వర్, రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, తిరుపతిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.